అక్కయ్య

శ్రీ ఆర్. యం. చిదంబరం

సముద్రపుటలలు అశాంతితో చెలరేగుతున్న హృదయంలా ఎగిరిపడుతున్నాయి. సంధ్యకాంతులు నెమ్మదిగా జారుతున్నాయి. అంతసేపటివరకూ తేనెపట్టులాగుండిన సముద్రతీరం క్రమంగా పల్చబడుతోంది. సంధ్య సౌందర్యాన్ని, అరసికుడి చేతిలో పడిన అందంలా, కబళించి వేయటానికి చీకటి తొంగిచూస్తూ నవ్వింది.

అక్కడి వాతావరణం శ్రీపతి హృదయంలో ప్రతిబింబించింది. హృదయ సముద్రపు వీచికలు. హోరుమని చెవులదగ్గర నిరంతర ధ్వని. నాలుగోసారి అటు చూశాడు. ఛీ...ఏనాడూ రానిది తను బీచ్‌కెందుకొచ్చాడు. అవును. నిస్సందేహంగా అది అక్కయ్యే తెల్లకాగితంమీద ఎర్రసిరాగీతల్లా కిరణాలు.

ఆదర్శానికీ. యథార్థానికీ మధ్యయుద్ధం.

తెగినవీణమీద శాస్త్రీయ సంగీతాలాపన...

ధైర్యంగా అక్కడకు వెళ్ళలేడు. అక్కయ్యను పలకరించలేడు. అతని మెదడంతా విపరీతపు టాలోచనల్తో వుక్కిరి బిక్కిరవుతోంది.

క్రమంగా చీకటిపడుతోంది. అతను నెమ్మదిగా నడవనారంభించాడు. అక్కయ్యపక్కనుంచే కదలిపోతున్నాడు. ఆమె తన్ను పిలిస్తే?...పిలవదు. పక్కన కూర్చుని విరగబడినవ్వుతున్న వ్యక్తిని చూడగానే అతని కళ్లు రెండూ ఎర్రబడ్డాయి. రిక్షాయెక్కి సినిమా రోడ్డుకు పోనీమన్నాడు.

శ్రీపతి కృష్ణాటాకీస్ దగ్గరకొచ్చాడు. ఇంకా సినిమా వదల్లేదు. అదేదో ఇంగ్లీషు చిత్రం. బైటవున్న స్టిల్సుని బట్టి అంతా 'సెక్స్'. నాన్న గనక తను యీ సినిమాకు వెళ్ళటం చూసివుంటే?...బుర్ర బద్దలు కొట్టుకు నేవాడు. ఇప్పటికతను అక్కయ్యను టవున్‌లో మూడుసారులు చూశాడు. ఓసారి సిటీ యంపోరియంలో సిల్కు చీరలు కొంటుండగా-అతను పలకరించలేదు. ఆమె చూడలేదు గాబోలు! చూస్తే పలకరించదూ! మరోసారి మేటినీషోలో-మూడోసారి పార్కులో-తప్పించుకుని వెళ్ళిపోయాడు.

సిగరెట్టు కాలుస్తూ రోడ్డువారగా నిలబడ్డాడు. సగం కాలిన సిగరెట్టు వంక చూశాడు. గుండె గుభేలుమంది. తనవంశంలో-కనీ-వినీ-ఎరగంది...

నాన్నకు తెలిస్తే?

తక్షణం ఆత్మహత్య.

సిగరెట్టు కాలుస్తే తప్పేముంది? పరిమితంగా వుంటే ఫరవాలేదు. అనేవాడు ఓలెక్చరరు. క్రమంగా ఆ సిద్ధాంతం అతనిలో జీర్ణించుకు పోయింది. ప్రతి విషయంలోనూ మోడరేషన్ వుండాలనే హిల్టన్ వాదన కూడా అతను "హేట్సాఫ్" అన్నాడు. ఆఖరుకు స్త్రీ పాతివ్రత్యాని కూడా మోడరేషన్! అతను నవ్వుకున్నాడు.

సినిమా వొదిలేశారు.

మరో అరగంటకు టిక్కట్టు తీసుకుని వెళ్ళి కూర్చున్నాడు. ఆట మొదలు పెట్టటానికి ఇంకా గంట వుంటుంది.

అతను మరో సిగరెట్టు వెలిగించాడు.

"సిగరెట్టు కాలుస్తున్నావా తమ్ముడూ!... నాన్నకు తెలిస్తే ఏమవుతుందో - ఎంత బాధపడతాడో తెలుసా?"

శ్రీపతి వాస్తవిక ప్రపంచంలోపడి పక్కకు తిరిగి చూశాడు. అక్కయ్యే కనిపించింది. ప్రక్కన సాయంత్రం కమల నవ్వులో భాగం పంచుకున్న వ్యక్తి.

"ఇక్కడ కూర్చుందాం"...తన పక్కన అక్కయ్య అతనూ కూర్చున్నారు. అత నింకా

ఆమెకేసి అలా చూస్తూనేవున్నాడు. మెళ్ళో రవ్వల నెక్లెస్ మెర్క్యురీలైటు కాంతిలో తళుక్కు తళుక్కుమంటోంది. ఎర్రటి దుద్దులు మెరుస్తున్నాయి. చేతిలో హేండ్ బాగ్! స్వంతంగా అల్లింది గాబోలు! ఇంతటి సిరి సంపదలు అక్కయ్య ఏ నాడైనా యెరుగునా?

"నామీద నీకు కోపంకదూ తమ్ముడూ? అందుకే అలా మూగనోముపట్టావు" చిలిపిగా, ప్రేమగా నవ్వింది అక్కయ్య.

"ఛీ...సిగ్గులేని నవ్వు" అనుకున్నాడు.

"ఎందుకూ కోపం?"

"కాకపోతే నన్ను బీచ్‌లో చూసినప్పుడు ఎందుకు పలకరించ లేదు? ఇంతకు ముందు మూడుసార్లు నువ్వునన్ను చూడటం - నిన్ను నేను చూడటం సంభవించింది. నీ అభిప్రాయం?

"నిజంగా నేను నిన్ను చూడలేదు. కాని నువ్వు చూశావు కదా! ఎందుకు పలకరించలేదు?"

"నువ్వు పలకరిస్తావో లేదో చూద్దామనే వూరుకున్నా!

"నేనూ అంతే!" అనేసి నాలిక్కరచుకున్నాడు.

"అబద్ధం ఆడినా నేర్పుగా వుండాలి. దొరికిపోయావ్" అంటూ పకపక నవ్వింది. శ్రీపతి సిగ్గుపడిపోయాడు.

"పోనీ- అయిష్టంతో నే మాటలు మానుకున్నా; నువ్వు చేసినపనికి ఎవరైనా అంతే! ఇందులో క్రాస్ ఎగ్జామిన్ చెయ్యటానికే వీల్లేదు."

అక్కయ్యకు కోపం రాలేదు. నవ్వింది. అంత గంభీరత అక్కయ్య కెలా వచ్చిందో!

"ఇతను మా తమ్ముడు శ్రీపతి. ఇంటర్ సీనియర్ ...ఈయన మీ బావగారు." అంటూ పరిచయ వాక్యాలు పలికింది అక్కయ్య.

"బావ" అన్నమాట వినగానే అతనికి ముళ్ళ మీద నడిచినట్టైంది.

"అలాగా!...మా బావమరిదిని కలుసుకున్నందుకు చాలా సంతోషం. నీ గ్రూపు?"

శ్రీపతి జవాబు చెప్పకూడదనే అనుకున్నాడు. కాని అనుకోకుండా "యం. పి. సి." అన్నాడు. అతని మొహం చూడగానే రావలసినంత కోపం రాలేదు.

ఇంటర్వెల్ దాకా ముగ్గురికీ మధ్య మౌనం నిలిచింది. అక్కయ్య మూడు డ్రింకులు పుచ్చుకుని ఒకటి శ్రీపతికిచ్చింది. అతను వద్దనలేక పుచ్చుకుని తాగాడు. నాన్న మాటల్లో అనాలంటే అటువంటి పాపిష్ఠిదాని చేతి డ్రింకు తాగినందుకు ఏడుజన్మల పర్యంతం మహాపాపం వెంటవస్తూంటుంది. సినిమాలోంచి వెళ్ళిపోదామనుకున్నాడు కూడా!

ఇంతకీ అక్కయ్య చేసిన అపరాధం?—

* * *

ఆవేళ ఇంకా బాగా తెల్లవారలేదు. గలగలమని మువ్వలచప్పుడు క్రమంగా దగ్గరై ఇంటిముందు ఆగింది. అక్కయ్య రెండెడ్ల బండిలోంచి దిగింది. ముసుగు తన్నిపెట్టి నిద్రపోతున్న తను ఒక్కసారి మేలుకున్నాడు. ముందు వుత్తరం ముక్కయినా రాకుండా అక్కయ్య వచ్చింది. ఇందులో ఏదో విశేషముంది- అక్కయ్య తనెందుకు వచ్చిందీ చెప్పనూ లేదు. నాన్న అడగనూ లేదు. ఎందుకొచ్చావని కన్నకూతురు నెలా అడుగుతాడు? అందుకే ఆవిడ నోటంటే విందామని వూరుకున్నాడు.

'అల్లుడు రాలేదే?' అని మాత్రం అడిగాడు.

దానికి అక్కయ్య ఎలాంటి సమాధానమూ యివ్వకపోటంతో అనుమానాలు ఇంకా స్థిర పడ్డాయి.

అక్కయ్య మునుపటికిమల్లే ఉత్సాహంగా లేదు. ఎప్పుడూ నవ్వేదిగాదు. దిగులుగా వుండేది. ఇదంతా చూస్తుంటే ఇద్దరికీ మధ్య ఏదో అఘాతం ఏర్పడిందన్న సంగతి రుజువైంది. ఓనాడు నాన్న అడిగాడు:

'అమ్మాయ్!...ఏదో దాస్తున్నావు. అసలు సంగతి చెప్పమ్మా!

అక్కయ్య భోరుమంది. ఇన్నాళ్ళూ అణచిపెట్టిన దుఃఖం లావాలా పైకుబికింది. అగ్నిపర్వతం బద్దలైంది. బావతత్వం ఆయనికి కొద్దిగా తెలుసు. అక్కను రెండో పెళ్ళివాడికిచ్చారు. మొదట్లో ఈ సంబంధం వొద్దని నలుగురూ నచ్చచెప్పారు. కాని

తండ్రి వినలేదు. వాళ్ళకుటుంబం సంప్రదాయమైంది. దేవుడి గదిలో ఎత్తయిన దేవుడివిగ్రహం ముందు కూర్చుని పెద్దగా మంత్రాలు చదువుతూ, మడిగా వియ్యంకుడు పూజచేస్తున్నాడట. వియ్యపురాలు వుదయమే కాలవకెళ్ళి స్నానంచేసి వస్తుందట. ఇంటి నిండా దేవుడిపటాలు! ఇంతకంటె ఏంకావాలి?... సాయంత్రమయ్యేసరికి భగవద్గీతా పారాయణంకాని-పురాణ పఠనంకాని వుంటుంది.

మొదటిపెళ్ళాన్ని అత్తగారు విషం పెట్టి చంపింది. రాచిరంపాన పెట్టింది...

ప్రతిరోజూ తల్లిమాటలు విని పెళ్ళాన్ని అకారణంగా చావగొడతాడు. అతన్తో ప్రతిదీ పేచీయే!

అక్కయ్య ఏడుస్తూ ఇంకా చెప్పింది. భర్త ఎన్నివిధాల తనను బాధపెట్టాడో! అత్తగారు ఎన్ని విధాల సాధించిందో! అంతా మామూలు సాదే! అందుకే తను ఎదిరించి వచ్చేసింది.

'అయితే ఇంక వెళ్ళవా? శాశ్వతంగా బంధం తెంపుకుని వచ్చేశావా?...ఆడదానికి పుట్టిల్లు నరకం-అత్తిల్లు స్వర్గం-భర్త దైవం-తెలిసిందా? అనవసరంగా అప్రతిష్ఠ. నేను తలెత్తుకు తిరగొద్దూ? అది సంప్రదాయ కుటుంబం. కట్టుబాట్లు ఎక్కువగా వుంటాయి. అన్నింటికీ వోర్చుకోవాలి. మరి ఆడదంటే ఏమనుకున్నావు?" అని వుపదేశం చేశాడు తండ్రి. అత్తగారిబాధలు ఎలాగ తొలగిపోతాయో కూడా తండ్రి వివరించాడు. ఆవిడకు ముసలితనం వచ్చింది. కనక త్వరగా కన్ను మూస్తుంది. అప్పుడు అక్కయ్యే ఆ యింటికి రాణి అవుతుంది. భర్తను తనకనుసన్నల్లో వుంచవచ్చు. అంతేకాని కళ్ళువుండి తను గోతిలోకి దూకాడని మాత్రం ఒప్పుకోడు నాన్న. అక్కయ్య మూగగా చూసింది. ఆమె మానసికబాధ శ్రీపతి కర్థం కాలేదు. ఆ యింట్లోనే వుండి తండ్రి భావాలలో భాగం పంచుకున్నవాడు కనక అతను అక్కయ్యను క్షమించలేక పోయాడు. నాలుగయిదు సార్లు అక్కయ్యను తిరిగి భర్త దగ్గరకు వెళ్ళిపొమ్మని శాసించాడు తండ్రి. అంటే అతనికి కూతురిమీద ప్రేమ లేకనా? కొలెడంత ఉంది......అది అతనికి మాత్రమే అర్థం అవుతుంది.

"నన్ను తలెత్తుకుని తిరగనియ్యవా?" అన్నాడు. నలుగురూ నాలుగు మాటలూ అంటున్నారట. ఎలాగ?

పతి ఎలాంటి వాడయినా అతడే దైవం!...... తుమ్మెద రొదలా చెవిలో ఉపన్యాసం...హిందూ స్త్రీ అంటే?...భర్త ఎలాంటి వాడయినా అతనికి సపర్య చెయ్యాలి. తన సర్వస్వం అతని కప్పగించాలి. ఎంతమంది వొచ్చినా వొండిపారేయాలి. కనీసం రెండు కూరలు - వో పచ్చడి - అతిథి మర్యాదఅంటే యేమిటి మరి? భర్త కుష్ఠురోగి అయినా అతన్ని మోసుకుని వెళ్ళి అతని ప్రేయసి దగ్గరకు చేర్చాలి. చచ్చిపోతే యముడితో పోట్లాడాలి.

'నువ్వు గులాబీరంగు చీరకట్టుకో!' అంటే వెంటనే ఆపని చెయ్యాలి. రాత్రిపన్నెండుకూ, రెండుకూ అతను వచ్చినా మేలుకునివుండి అతను అన్నంతిన్నాక తను తినాలి. ఎంతమంది పిల్లల్నికంటే అంతగొప్ప. 'ఒక్కసారి సినిమాకు తీసికెళ్ళరూ?' అంటూ భర్తను బ్రతిమాలుతూండాలి. ఇంతవినయంగా అణగిమణగివుంటే సమాజం ఆమెకు 'ఉత్తమాయిల్లాలు' పట్టాన్ని ప్రసాదించటానికి యత్నిస్తుంది...శ్రీపతికూడా అక్కయ్యతో మాట్లాడటం మానుకున్నాడు.

చివరికి ఓనాడు అక్కయ్య అంది: 'నాన్నా! నేనివాళ వెళతాను. నాకు ప్రపంచం అర్థమైంది. ఎత్తిపొడుపులు ఇంక సహించలేను.'

నాన్నకళ్ళు తళుక్కుమన్నాయి. హిందూ ధర్మం నిలిచింది. 'దేవుడికి కటాక్షం కలిగింది' అన్నాడు. అక్కయ్య బండెక్కి వెళ్ళింది...భర్త దగ్గరకు.

'మొగుడంటూ వొకడుంటే అదే పదివేలురా! భర్తపోయినవాళ్ళను చూడు!' అన్నాడు, అక్కయ్య వెళ్ళిపోయాక తన్నుద్దేశించి నాన్న. అదీ నిజమే ననిపించింది అతనికి. భర్తపోతే హిందూసంఘంలో ఇంకేమైనావుందా? చీకటిగదిలో వుండాలిట. పువ్వులను గురించి మనసులో అయినా తలపెట్టకూడదు. సౌందర్యాన్ని చంపుకోవాలి. వీలైనన్ని ఉపవాసాలు చెయ్యాలి. భగవద్గీత నిరంతరం చదువుకోవాలి. పోనీ, రామాయణభాగవతాల్లాంటి గ్రంథాలనైనాసరే!... నాన్న దేవుడిముందు కూర్చుని 'ఓం' అంటూ ముక్కు పట్టుకున్నాడు.

సరిగ్గా అక్కయ్య వెళ్ళిపోయిన నెలరోజులకు ఓనాడు సాయంత్రం తండ్రి తన రూంకు పరుగెత్తుకొచ్చాడు.

"కొంప మునిగింది" అన్నాడు. శ్రీపతి ఏవన్నట్టు చూశాడు.

"మీ అక్కయ్య భర్తదగ్గరకు కాదు వెళ్ళత-"

"కొంపతీసి మనసువిరిగి ఆత్మహత్యకాని చేసుకోలేదుకదా ?"

శ్రీపతి ఈమధ్య తండ్రి దగ్గర లేనికారణంచేత పత్రికలు తెగచదువుతున్నాడు. అందులో ఇలాంటి సంఘటనలు అనంతం.

"అలాగైనా బాగుండును. ఎవడితోనో లేచిపోయింది. నా పరువు ప్రతిష్ఠలన్నీ గంగపాలయ్యాయి. అందరికీ యీ విషయం తెలిసిపోయింది. కడుపులో చిచ్చుపెట్టింది. మన కుటుంబ గౌరవాన్నంతా మంటగలిపింది. ఇంక ఏ మొహం పెట్టుకుని వూళ్ళో తిరగను?"

నాన్న వొణికిపోతున్నాడు. అతనికున్న మనస్థైర్యం అంతే! అతనికి సంఘంలో ఆకాశమంత ఎత్తుస్థానం వుంది. సమాజం ఈమాటతన్ని కిందకు తోసివేస్తుంది. నాన్న పాతాళంలో పడ్డాడు. శ్రీపతికూడా చలించి వూరుకున్నాడు. అక్కయ్యను గురించి అతనికెలాంటి అభిప్రాయమూ కలుగలేదు.

తరువాత కొంతకాలానికి అక్కయ్య సిల్కుచీరలు కొంటూ సిటీ ఎంపోరియంలో కనిపించింది.

* * *

"తమ్ముడూ !... పరధ్యానంగా వున్నావు. సినిమా చూడ్డానికికదూ నువ్వొస్త? అస్తమానం ఆలోచించి బుర్ర పాడుచేసుకునేవాళ్లు సంఘానికి విద్రోహులు." అంది అక్కయ్య. అతను పరధ్యానంగా అనుకోకుండా నవ్వాడు.

సినిమా అయిపోయింది.

ముగ్గురూ బయటకొచ్చారు. శ్రీపతి సైకిలు రిక్షా బేరమాడబోయాడు.

"నువ్వీ రాత్రి మాతో రావాలోయ్! ఎక్కడికీ వెళ్ళటానికి వీలులేదు" అంది అక్కయ్య. అతను ఎందుకో కాదనలేకపోయాడు. డ్రైవరు డోర్ ఓపెన్ చేశాడు. శ్రీపతిముందు సీట్లోకూర్చున్నాడు. ఇద్దరూ వెనకాల కూర్చున్నారు.

"శ్రీపతికి ముభావంగా వుండటం సరదాగాబోలు!" అన్నాడతను.

"మరే...నిజం తెలిసొచ్చేవరకూ అలాగే వుంటుంది." అని సమాధానం చెప్పింది అక్కయ్య.

ఇంగ్లీషు పిక్చరు కావటం మూలాన త్వరగా అయిపోయింది. ఓ పెద్ద మేడముందు కారు ఆగింది. శ్రీపతి అక్కయ్య వెనకాల ఇంట్లో అడుగుపెట్టగానే గడియారం పన్నెండుకొట్టింది. ఇంటిముందు గులాబీ మొక్కలు, మల్లె మొక్కలు నిద్రపోతున్నాయి. మెర్క్యురీ లైటువేయగానే హాలంతా తళుక్కుమంది...

"స్వీట్ హోం" అంటూ గుమ్మానికి కట్టెను.

"తమ్ముడూ నువ్వు భోంచేశావా?"

"చేశాను." అన్నాడు ధీమాగా.

"అబద్ధం!" అంది. అతను భయపడ్డాడు. ఈ ఆడవాళ్లకు రహస్యాలన్నీ ఎలా తెలుస్తాయి? అదీ విచిత్రమే!

"నిన్ను భోంచెయ్యమని బలవంతం పెట్టంలే! పన్నెండు గంటలకు భోజనం యేమిటి? మాకూ ఆ అలవాటులేదు' అని అక్కయ్య శ్రీపతి ముందు ఆపిల్సూ, ద్రాక్షా, షాంగ్రిల్లా సైన్ బిస్కట్సూ ఉంచింది. ఫ్లాస్కులో ఉన్న పాలు ముగ్గురికీ సర్దింది. అతను సంశయిస్తూ తినసాగాడు. ఎదిరించి అక్కణ్ణుంచి వెళ్ళిపోదామనే ఉంది. కాని ఎలాగ? ఎందుకో హృదయం అంగీకరించటం లేదు. ఏదో అజ్ఞాతశక్తి ముందరికాళ్ళకు బంధం వేసి తనను కదలనీయకుండా చేస్తోంది.

'అయితే శ్రీపతీ! నువ్వు బై. పి. సి. తీసుకుని ఉంటే హాయిగా మెడిసన్ చదవొచ్చుగదా! ఎందుకు ఎం. పి. సి. చదువుతున్నావు?'—అతను కొంచెం ఆశ్చర్యపడ్డాడు. అయితే తన్నుగురించి అక్కయ్య అంతా చెప్పిందన్నమాట!

'బహుశా ఇంజనీరింగు చదువుదామని గామోలు ఏం తమ్ముడూ! అంతేనా?' అంటూ భర్త ప్రశ్నకు తనే సమాధానం చెప్పింది.

'నీకు తెలియందేముంది అక్కయ్యా!...నాన్న తత్వం - ఆయనతీరు కొత్తకాదుగా!' అన్నాడు శ్రీపతి. అతనికే ఆశ్చర్యం కలిగింది. 'అక్కయ్యా!'

అని పిలవకూడదనుకొన్నాడు...కాని అక్కయ్య అంతా గ్రహించినట్టు నవ్వింది.

'పోనీ... నే చదివిస్తా చదువు. నీకంటె కావలసిన వాళ్లు నాకెవరూ లేరు.'

అక్కయ్య గంభీరంగా అంది.

'సరి...అయితే నన్ను వెయిటింగ్ లిస్టులో వేశావన్నమాట!' అని హృదయపూర్వకంగా నవ్వాడు డాక్టరు.

అయిదునిమిషాలు నిశ్శబ్దం తాండవించింది.

'శ్రీపతీ!...నువ్వు కుర్రాడివి కాదు. తెలివైనవాడివని మీఅక్కయ్య చాలాసార్లు చెప్పింది.అంచాత మూఢ సంప్రదాయాలకు, అర్థంలేని పట్టింపులకూ లొంగిపోయి బుర్ర పాడుచేసుకోకు. విశాల హృదయంతో పరిస్థితుల ప్రాభవాన్ని అర్థంచేసుకొని మంచిచెడ్డలు నిర్ణయించు. చెప్పుడు మాటలు ఎన్నడూ వినకు...మీ యక్క మీద నీకు విపరీతమైన కోపం వుండి వుంటుంది. ఆ కోపం ఇంకా నీలో వుందంటే నీకూ, అనాది మానవుడికీ వ్యత్యాసం లేదన్నమాట... అంతేకాదు. నీచదువు కూడా వృథా'

శ్రీపతి ఏదో తప్పిదం చేసినవాడిలా బాధపడుతూ వింటున్నాడు. డాక్టరు ఇంకా ఏదో చెప్పబోయాడు. టెలిఫోన్ కాల్ వచ్చింది.

'అర్జంటుగా కేసొకటి వచ్చింది. నేను వెళ్లాలి.'; అంటూ పాలు మాత్రం ఒక్క గుటకలో తాగేసి డాక్టరు స్టెతస్కోపు, లెదర్ బాగ్ తీసుకుని వెళ్ళిపోయాడు.

'క్షణం తీరిక వుండదు; ఇంట్లో సుఖం వుండదు ఏం డాక్టర్లు బాబూ!...తమ్ముడూ, నువ్వు మాత్రం డాక్టరు చదివొద్దు. ఇంజనీరైనా అంతేననుకో.'

శ్రీపతి పాలు తాగటం పూర్తయింది.

'డాక్టరుగారిప్పుడు రారా!

'వస్తారు. కాని బావని పిలవటానికి నీకు నోరు తిరగటం లేదుకదా! అవును...ఎలా తిరుగుతుంది? నేను చేసిన పని వ్యభిచారంతో సమానంగా —ఇది క్షంతవ్యం కానిపని. అందరూ మొహంమీద వుమ్మేస్తారు. సంఘంలో ఎవరూ గౌరవించరు... నువ్వూ అంతేనంటావా?'

అతను మాట్లాడలేకపోయాడు.

తలుపులు రెండూ చేర వేసింది.

'నిద్ర వొస్తోందా? నీకు బాగా లేదుకదా!'

"లేదు.... నేను ఒంటిగంటదాకా ఏదో చదువుకుంటూ వుంటాను." శ్రీపతి చిన్న అబద్ధం ఆడాడు. అతను పదింటికే పడుకోటం అలవాటు.

"నేను చేసినపని తప్పని నువ్వు విశ్వసిస్తున్నావా?...నీకు నేనంటే అసహ్యంగా లేదూ? నన్ను తప్పు పడతావుకాని నే నెలాంటి జీవితం అనుభవించానో నీకు తెలుసా? భర్త భార్యను అకారణంగా చావగొట్టి, అత్తగారూ, వెధవకూతురూ కూడా ఎందుకులే! సింహాసనంమీద కూర్చుని నానా చాకిరీ చేయిస్తుంటే, అన్నీ సహించి, ఆఖరుకు భర్త శీలాన్నే శంకిస్తే? అప్పుడు హిందూస్త్రీగ తేమిటని నువ్వెప్పుడైనా ఆలోచించావా? నా పరిస్థితులు కూడా అంతే! డాక్టరుగారు, ఆయన స్నేహితులు. డాక్టరుగారితో నాకు అనుబంధంవుందని శంకిస్తే?...దాన్ని నిజం చేసుకోటమే వుత్తమం. నువ్వింకా చిన్నవాడివి. నేనూ మొన్న మొన్నటిదాకా చిన్నదానినే! కాని ఈ స్వల్పకాలంలో నాకు ప్రపంచం అర్థమైంది. నాలాంటివాళ్లు ఎంతమందో నీకేం తెలుసు? ఈ సంసారాల్లో నూటికి తొంభైవంతులు ట్రాజికల్. నాచరిత్ర సామాజిక యితివృత్తం కదూ?"

శ్రీపతి కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. అక్కయ్య కూడా ఏడుస్తోంది. పాత గాథలన్నీ తళుక్కున మెరిసివుంటాయి. అక్కయ్య ఏడవటం అతను సహించడు. అక్కయ్యస్థితి బాగుపడిందికదా! ఇంకా ఎందుకీ కన్నీరు! ఇంతటి అనుభవం సంపాదించినది ఏడవటంవలన జీవిత శృంఖలాలు తెగవని తెలుసుకోలేదూ?

'అక్కయ్యా!...నువ్వు దేవుడుగుళ్లోకి వెడుతున్నావా?'

అక్కయ్య తమాషాగా నవ్వుతూ 'ఎందుకూ?... అలాంటి నమ్మకాలు నాకూ వొదలిపోయాయి. నాకు ముక్తీ, మోక్షం అక్కర్లేదు స్వర్గలోకం అసలేవొద్దు. అదీకాక నావంటి పాపాత్ముల్ని దేవుడు క్షమించడుగా!...నువ్వు రూంలో ఎందుకుంటున్నావు? ఇక్కడికి వచ్చేయకూడదూ? కలిసి హాయిగా వుండవచ్చు' అంది విషయం మారుస్తూ.

అతను సమాధానం చెప్పకుండా భయంభయంగా చూశాడు.

'భయం వేస్తోంది కదూ!... ఈ దుర్మార్గురాలితో నా కెందుకనుకుంటున్నావు కదూ! మాతో కలిసివుంటే చిత్రగుప్తుడు నీ పేరుకూడా చిట్టాలో ఎక్కిస్తాడు. అప్పుడు యమకింకరులు నిన్ను సల సల కాగే నూనెలో పడేస్తారు...అమ్మో! ఆ బాధ అనుభవించటం కష్టంకాదూ?...అదీకాక నాన్నగుండెలు బాదుకుని ఏడవడూ? నీ సంప్రదాయ జీవితం నశింపు కాదూ?'

అదేంకాదు...తప్పకుండా వొస్తాను.'

అక్కయ్య ఇంకేం మాట్లాడలేదు. గడియారం ఒంటిగంట చూపించింది. అతను నిద్ర వొస్తోందని పడుకున్నాడు. తన కర్తవ్యాన్ని గురించి ఆలోచించు కుంటూ రెండు గంటలదాకా గడిపాడు. తరవాత చిన్న కునుకు పట్టింది...

శ్రీపతి రూం మార్చలేదు కాని ఇరవైనాలుగు గంటల్లో ఇరవైగంటలు అక్కయ్య ఇంటిదగ్గిరే గడుపుతున్నాడు. అతను డాక్టరుని 'బావ' అని మాత్రం పిలవటంలేదు. ఎన్నో విషయాలు అతనికి తెలిశాయి. ఎంతోమంది కొత్త వ్యక్తులతో అతనికి పరిచయం కలిగింది. డాక్టరు బలవంతాన క్లబ్‌లో మెంబరయ్యాడు. ఇద్దరూ కలిసి రాత్రి ఎనిమిదింటివరకూ పింగ్‌పాంగ్ ఆడుతుంటూ వుండిపోయేవారు.

అక్కయ్య నూతన జీవితాన్ని సూక్ష్మంగా పరీక్షించే అవకాశం కలిగిం దతనికి. ఆమె లేచివచ్చిం దన్న సంగతి ఎవరికీ తెలియదు. డాక్టరు కూడా తలిదండ్రులు లేరు. కావలసినవాళ్ళెవరూ లేరు. ఇద్దరూ రిజిష్టర్డ్ మేరేజి చేసుకున్నట్టు చెప్పాడుట డాక్టరు. ఈ అబద్ధం ఆడకపోతే ఎంత సుహృదయులైనా హిందూ సంఘంలో క్షమించరన్న సంగతి అతనికి బాగా తెలుసు.

ఓనాడు తండ్రి తనను వెతుక్కుంటూ క్లబ్బుకు వచ్చాడు. తండ్రి క్లబ్బుకు రావటం ఇదే మొదటిసారి. రూంకు మొదట్లో వెళ్లాడట. తనీ మధ్య అసలు రూంకి రావటంలేదని, ప్రస్తుతం క్లబ్బులో వుంటాడనీ ఆ యింటి యజమాని అన్నాడట. దాంతో నాన్న తిన్నగా ఇక్కడికే వచ్చేశాడు. శ్రీపతి డాక్టరుతో పింగ్‌పాంగ్ ఆడుతూ లోకాన్నే మరిచాడు. తండ్రి పిలవగానే వెళ్ళాడు.

'వెంటనే రూంకి పోదాం పదారా...నీతో మాట్లాడాలి' అన్నాడు ముందుకు రెండడుగులు వేసి.

మళ్ళీ అక్కడికి వెళ్లిపోయాడు.

"మళ్ళీ యెక్కడికిరా?" అని గర్జించాడు తండ్రి.

"ఆయనతో నేను వెడుతున్నానని చెప్పేసి వస్తా."

శ్రీపతి తండ్రివెంట, పితృవాక్య పరిపాలకుడిలా నడచి వెడుతుంటే డాక్టరు నవ్వుకున్నాడు. రూమ్ చేరుకున్నాక తండ్రి అడిగాడు: "శుభ్రంగా కూర్చుని చదువుకు నేవాడివి. ఏం పొయ్యే కాలమొచ్చి ఆ క్లబ్బులో చేరావురా" డబ్బు ఫ్రీగా వస్తుందను కున్నావా?..."హోటల్‌లో భోజనం చెయ్యటం లేదట. మరి యేం చేస్తున్నట్టు?" అతని కనుమాన ముగానే వుంది. దాపరిక మెందుకనుకున్నాడు శ్రీపతి.

"మీ అక్క ఈ వూళ్లోనే కులుకుతోందంట కదూ? అది మరో వెధవతో కారులో వూరేగుతుంటే మన రామాచారి చూచి చెప్పాడు. నిజమేనా? దాని మొహం తగలెయ్య. కుటుంబ గౌరవానికి చిచ్చు పెట్టింది"

శ్రీపతి వుద్రేకం ఆపుకోలేకపోయాడు.

"అవునాన్నా ... అక్కయ్య ననవసరంగా యేమనకు"

"అయితే దానిచర్యను సమర్థిస్తున్నావన్న మాట...దౌర్భాగ్యుడా? నాకంతా తెలుసు. దానింటి దగ్గరే నీ మకాం—దాని చేతి తిండికూడా తింటున్నావు. నీ పాపం లక్ష జన్మాలకయినా తరగదు. మరి నేనెందుకు చావటానికి?"

తెగేవరకూ తాడు లాగటమే మంచిది.

"నీకంత బాధగావుంటే నా గురించి శ్రమ పడొద్దు"

అప్రయత్నంగా శ్రీపతి చెంప ఛెళ్లుమంది. అతను మాట్లాడలేదు. ఎడం చేత్తో చెంప రాసుకున్నాడు.

"అవునుమరి...ఇన్నాళ్లూ చదివించాను కదూ మరి! అందుకు ప్రతిఫలం! "ఇప్పుడా రండు ముండ

కనపడగానే కళ్లు నెత్తిమీదకొచ్చి నాన్న కనపట్టం మానేశాడు. నీకు కొమ్ములొచ్చాయి. ఎలాగా తెగ తెంపులు చేసుకున్నావు కనక అలాగే చావు...నీకూ నాకూ బంధం నాస్తి" అనేసి ఆయన చకచక వెళ్లిపోయాడు. నాన్న తత్వం తనకు తెలుసు. ఎన్ననుకుంటే యేం లాభం? అయినా తనకంత వుద్రేకం కూడదు. అక్కయ్యను అనరాని మాట లంటుంటే తను క్షమించలేకపోయాడు. చేతిసంచీ పట్టుకుని, చింకిగొడుగుతో వెళ్లిపోతున్న నాన్నను చూడగానే అతనికి కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. పోనీ—వెనకాల వెళ్లి బ్రతిమిలాడి తీసుకొస్తే!...

గదికి తాళంవేసి అక్కయ్య దగ్గర కెళ్ళాడు. అంతా వివరించాడు.

"నీయిష్టం. తండ్రీ కొడుకులమధ్య అనుబంధాన్ని ఛేదించాననే అపవాదు నాకెందుకు? అనవసరంగా అక్కయ్యకోసం నీ నైతికజీవితాన్ని పాడుచేసుకోకు."

అతని దుర్బల హృదయం ఘోరుమంది. ఎటూ నిర్ణయించుకోలేకపోయాడు.

ఆకాశంలో చీకటి ఆవరిస్తోంది. చుక్కల్ని క్రమంగా మబ్బులు కబళిస్తున్నాయి వర్షానికి నాందీ వాక్యం కాబోలు!

ఆవేళ డాక్టరు రాత్రి తొమ్మిదిదాటాక వచ్చాడు. రావటంతోనే గుండెల్లో బాధగావుందంటు పడుకున్నాడు. ఇద్దరిగుండెల్లోనూ రాయిపడింది. చేసిన తప్పులకి శిక్ష అనుభవించే సమయం వచ్చిందా? అయినా ఇంత చిన్న విషయానికి కంగారెందుకు? తాము చేసిన చర్యలు తప్పని భావించేవా రందరికీ క్షణక్షణానికీ ఇలాంటి అనుభూతులు తప్పవు. అక్కయ్య మాత్రం నవ్వుతూనే వుంది. గుండె కాచింది. శ్రీపతి నిలువునా కంపిస్తున్నాడు. ఏ తెగకూ చెందని వాడతను. అలాగని తటస్థుడూ కాడు. ఉభయ పక్షాల్లోనూ వున్నాడు. దేవుడు వున్నాడని నమ్మలేడు. లేడని ధీమాగా చెప్పటానికి తరతరాలనుంచీ వొస్తున్న ఆచారాలు, కట్టుబాట్లు ఆకాశాన్ని అంటుతున్న అనేక రకాల దేవుళ్ల గుళ్ళు అడ్డం వొస్తున్నాయి. అలాగే అక్కయ్య చేసిన పనిని పూర్తిగా సమర్థించనూ లేడు. ద్వేషించి వైదొలగనూ లేడు. అతని తత్వం ఉభయ భ్రష్టత్వం. అందుకే అక్కడు లేని భయం అతనికి.

* * *

'నువ్వేం కంగారు పడకు. ఇదీయనకు అప్పుడప్పుడు వొస్తూంటుందిలే! తగ్గిపోతుంది. కొంచెం హార్ట్ వీక్ నెస్ అంతే' అంది అక్కయ్య. కాని పదైనా నొప్పి తగ్గలేదు. ఫోన్ చెయ్యగానే డాక్టర్ సీతాపతి వొచ్చాడు. అతనేదో చికిత్సలు చేస్తూ ఆ రాత్రికక్కడే వుండిపోయాడు. డాక్టరుకు సీతాపతి ముఖ్య స్నేహితుడు. అతని ఆంతరంగిక విషయాలన్నీ-ముఖ్యంగా అతని వివాహం గురించి అంతా సీతాపతికి తెలుసు.

'మరేం ఫరవాలేదు'ని అభయమిచ్చాడు సీతాపతి. కాని ఆరాత్రే అతని అభయ హస్తాన్ని ఖండించి డాక్టరును ఎగేసుకుపోయింది మృత్యువు.

ఏడవటం తెలివితక్కువని బోధించిన అక్కయ్య కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. ఎంతకాలం నుంచి దాచి వుంచిందో! భర్తను వొదిలివచ్చినప్పుడు కూడా అక్కయ్య ఏడవలేదు. ఆ సంగతి అతనికి బాగా తెలుసు. ఆకాశమంత యెత్తున హృదయ జ్వాలలు... ఇప్పుడామె బ్రతుకు?...ఎవడైనా ఛాందసుడి దగ్గరకు వెళ్లి అక్కయ్య జీవితాన్ని నేటివరకూ వివరిస్తే ఏం చెప్తాడు? ముందు అలాంటి పాపిష్టి గాథ విన్నందుకు చెవులు మూసుకుంటాడు గామోలు! 'అంతే అవుతుంది నాయనా!...పాపానికి తగ్గ ఫలితం అనుభవించొద్దూ? కట్టుకున్న మొగుణ్ణి వదిలేసి మరొకడితో వుండటం రంకుతనం కదూ! ...దానికి ప్రాయశ్చిత్తం అంటూ లేనేలేదు. చూడు నాయనా! అహల్య, మండోదరి, ద్రౌపది. వీళ్లందరికి మల్లే పతివ్రతల్లా బతక్కూడదూ? ఎందుకొచ్చిన పాడుబతుకు?' అని సమాధానం చెప్తాడు. మండోదరికి ఇద్దరు భర్తలట. ద్రౌపదికి అయిదుగురు వున్నా కర్ణుడిమీద మోజు వుండేదట. శ్రీపతి వెర్రిగా నవ్వుకున్నాడు. అక్కయ్య ఎంత కాలం ఏడుస్తుంది? అమ్మో! ఆమె కన్నీటికి ప్రపంచాలు మునిగిపోవూ? ఇంకెలా జీవిస్తుంది?...మరొకణ్ణి పెళ్లాడుతుందేమో!...

ఆమెను ఓదార్చటానికి అతను యత్నించలేదు. మర్నాడుదయం సీతాపతి వచ్చాడు. అతను కూడా చాలా బాధపడ్డాడు. అక్కను ఓదార్చటానికి యెన్నో విధాల ప్రయత్నించాడు. డాక్టరు తాలూకు సొమ్ము బాంక్ లో ముప్పైవేల దాకావుంది. ఆమెకు బోలెడు నగలున్నాయి. ఇక

ముందు ఆర్థికంగా ఎలా నడుస్తుంది అన్నది ప్రస్తుతానికి సమస్య కానేకాదు. సీతాపతి ఆనాటినుండి పాతస్నేహాన్ని పురస్కరించుకుని తరుచుగా వొస్తూండేవాడు. డాక్టరు పోవటం శ్రీపతికి మరోసమస్యను సాధించి పెట్టింది. ఇప్పుడు అక్కయ్యకు "నా" అన్నవాళ్లెవరూ లేరు. అంటే ఒక్క శ్రీపతే! అంచాత అతను అక్కదగ్గరేవుంటూ ఆమె యోగక్షేమాలు గమనిస్తూ వుండటం స్థిరపడిపోయింది. గది వదిలేసి బసమార్చాడు. అక్కయ్యకూడా ఆడంబరం తగ్గించింది. పనిమనిషిని మాన్పించింది. వీలైనంతవరకూ ఖర్చులు తగ్గించింది. శ్రీపతి తండ్రికి వుత్తరం రాశాడుకాని జవాబురాలేదు. ఒకసారి తనే స్వయంగా వెళ్లాడు.

ఆ వూళ్లో నలుగురూ అతన్ని యీసడిస్తూ చూశారు. నోటికివచ్చినట్టు తిట్టారు. తండ్రిని చంపావన్నారు. అతను దిక్కులేని చావు చచ్చేందుకు తనే కారణమన్నారు. ఇల్లూవాకిలీ అమ్మేసి కొంతధర్మానికి, కొంత తనకిమ్మని ఏర్పాట్లుచేశాడు. శ్రీపతి తలబాదుకుని ఏడ్చాడు. "అంతా దొంగ ఏడుపు...నటన" అన్నారు. ఓ పెద్దమనిషి అతని ముందు డబ్బులెక్కపెట్టివుంచాడు. శ్రీపతి అది కూడా ధర్మనిధికి కలపమన్నాడు. అతని గొప్పతనాన్ని ఎవరూ మెచ్చుకోలేదు.

"పాపం!... ఆ మారాజు ఎంతమంచివాడు! కొడు కెలాంటివాడైనా కన్నకడుపుకదూ! అతనికన్యాయం జరగకూడదని సగం వాటా అతనికిచ్చాడు. మరోడైతే ఆస్తంతా తగలెట్టటానికైనా వొప్పుకుంటాడుకాని ఇతనికివ్వడు. కుర్రతనం వాడికేం తెలియదు అంటూ పోయాడు. ఎంత పకువుగా బ్రతికాడు! ఎంత నిష్ఠగా వున్నాడు! ఆచారం. కట్టుబాటు!...ఆహో హో! ఆయన కాయనేసాటి!" అన్నారు అందరూ.

శ్రీపతి తను పుట్టిపెరిగిన యింటికేసి వోమాటు చూసి వెనక్కి తిరిగాడు. అతనికి నాన్న ఎదురుగా కనిపిస్తూనే వున్నాడు. చిన్న పిలక - ఎప్పుడూ పందలపాక చొక్కా - కళ్లల్లో కాఠిన్యం - తాను పట్టిన కుందేటికి మూడేకాళ్ళనే తత్వం—ఎంతో అభిమానం, ప్రేమ వున్నా వెల్లడించటం చేతకాదు. అర్థంలేని ఆవేశం—అతను తిరిగొచ్చి అంతా అక్కయ్యకు నివేదించాడు. అక్కయ్యకూడా భోరున ఏడవటంతో "ఆమె కెందుకు చెప్పావా?" అనుకున్నాడు.

* * *

శ్రీపతి జీవితక్రమమంతా మారింది. తన కుటుంబచరిత్ర నలుగురికీ తెలిస్తే తనకు సంఘంలో వున్న గౌరవం నశిస్తుందేమోనని అతనికి భయంగానే వుంది. అతని తలిదండ్రులనుగురించి నలుగురూ ఆడిగారు. అతనేదో సమాధానం చెప్పుకున్నాడు. "ఫలానా లేట్ డాక్టరు గారి భావమరిదిని నేన"ని కొన్నిచోట్ల పరిచయం చేసుకున్నాడు.

శ్రీపతి ఇంటర్ ప్యాసై ఇంజనీరింగులో సీటు సంపాదించాడు. తను ఇంజనీరింగు చదవగలనని అతనెన్నడూ అనుకోలేదు. సీతాపతి ఇదివరకటికంటె తరుచు అక్కడికొస్తున్నాడు. నలుగురూ నాలుగు మాటలూ అనుకోటం అటుంచి శ్రీపతి కూడా కొంత ఫీల్ అయ్యాడు: ముగ్గురు నలుగురు అతన్ని గురించి చాటుగా అనుకోటం కూడా జరిగింది. ఏ ఇద్దరైనా నెమ్మదిగా మాట్లాడుకుంటూ మధ్య మధ్య అతనికేసి చూస్తుంటే అదంతా తననుగురించేనని అతను చాలాసార్లు అనుకోటం సంభవించింది. సీతాపతిని రావొద్దందామని చాలాసార్లనుకున్నాడు. కాని అక్కయ్య ఏమంటుందోనని కొంచెం భయం. తను లేనప్పుడు కూడా సీతాపతి వొచ్చేవాడు. అయితే అతను అక్కయ్యతో అంత తరుచుగా మాట్లాడటానికేం విషయాలున్నాయో మాత్రం అతని కంతుచిక్కలేదు.

ఇంజనీరింగు కాలేజీలో చేరిన నెలరోజులకు అతనోమాటు కాకినాడలో ఎగ్జిబిషన్ చూసి తిరిగివస్తూ సామర్లకోటలో రైలుకోసం నిలబడ్డాడు. అతని భుజంమీద బరువైన చెయ్యి పడింది. వులిక్కిపడి వెనక్కి తిరిగాడు.

'శ్రీపతీ!... నేను జ్ఞాపకం వున్నానా?' అనడిగాడా వ్యక్తి. శ్రీపతి నిమిషంసేపు అతన్ని తేరిపార చూసి 'ఓ...బావ! ఏమిటి అవతారం! కులాసాగా వున్నావా?' అనడిగాడు.

'ఈ అవతారం ఎందుకెత్తానో వూహించుకో. ఇది పదకొండో అవతారం.' అనేసి నవ్వాడు బావ.

శ్రీపతి కళ్లు నులుముకున్నాడు. బావకేసి చూడలేకపోయాడు. ఎందుకో బాగా గెడ్డం పెంచాడు. బట్టలు మాసిపోయాయి. కళ్లు "పాతాళం ఇక్కడే నయ్యా! ఎందుకు అనవసరంగా వెతుకుతావు?" అంటున్నాయి. దవడలు రెండూ పీక్కుపోయాయి. మనిషి సగమయ్యాడు.

'రా బావా! స్టాల్‌కి వెళదాం.' అంటూ ఓవర్ బ్రిడ్జి క్రాస్ చేశాడు.

'నీకు బండికి టైం కాలేదూ?' అడిగాడు బావ.

'ఇంకా అరగంటవుంది...అసలు సంగతేవిటి? ఎందుకిలాగై పోయావు?' అడిగాడు పూరీ—కూరా అతని ముందుకు తోస్తూ.

'నీకు తెలియందేముంది? మీ అక్కయ్య వెళ్ళి పోయాక నేను పశ్చాత్తాపపడ్డాను. అంతా జరిగిపోయింది. ఎందుకులే అవన్నీ చెప్పుకోటం...అసలు నిన్ను పలకరించకూడదనుకున్నాను మొదట. మా అమ్మ—నాన్న ఇద్దరూ కలరావచ్చి పోయారు. నేనూ పోతే బాగుండును...తరవాత మీ సంగతి గురించి అంతా విన్నాను. నేను సుఖపెట్టలేక పోయాను. దానైనా సుఖపడనీ—'

రెండు జతల కళ్లు కన్నీటిని నింపుకున్నాయి. నాన్న ఇదివరకన్న మాటలు అతనికి జ్ఞప్తికొచ్చాయి... "అత్తగారికి ముసలితనం వచ్చింది కనక ఆవిడ త్వరగా కన్నుమూస్తుంది. అప్పుడు అక్కయ్య ఆ యింటికి రాణీ అవుతుంది. భర్తను తన కనుసన్నల్లో వుంచవచ్చు.' బావ ఎన్నడూ పూరీల మొహం ఎరగనివాడిలా ఆవురావురుమని తింటున్నాడు.

'ఇప్పుడెక్కడికెడుతున్నావు?'

'మావూరే! ... పెళ్లి సంబంధం చూట్టానికి కాకినాడెళ్ళాను.'

'ఎవరికి? నీకా?'

బావ ఫకాలుమన్నాడు. 'నాక్కాదు, ఏం? నేను పెళ్ళికొడుకులా కనిపిస్తున్నానా? ఇంకీ జీవితానికి అలాంటి ఆశల్లేవు. మా చెల్లాయికి సంబంధం.'

బావ వెళ్ళాల్సిన బండి వొచ్చింది. మౌనంగా బండిలోకెక్కి కూర్చున్నాడతను. బండి కదులుతుంటే బావ అన్నాడు:

'మీ అక్కయ్యతో నన్ను క్షమించమని చెప్పు.'

'తప్పు బావా! అవేం మాటలు!' అన్న శ్రీపతి వాక్యాలు రైలింజను కూతలో కలిసిపోయాయి.

శ్రీపతికి బావగురించి ఇదివరకున్న అభిప్రాయాలు కొంచెం పరివర్తన చెందాయి. పాపం! అతని హృదయం అమాయకత్వంలో మునిగిపోయింది. నవనీతం లాంటిది...తల్లీ తండ్రీ కలిసి అతనిలో వున్న మంచిని అణచివేసి అతనికయిష్టమైన పనులు చేయించారు. అతన్నలా పెంచారు. తనను తండ్రి పుస్తకాల పురుగుగా—మూఢ నమ్మకాలకి—'ఏం? ఎందుకు'? అని ప్రశ్నించటానికి వీలులేని కట్టుబాట్లకు బానిసగా పెంచాడు. చివరి కాసంకెళ్లు అక్కయ్య తెంపాల్సి వచ్చింది. బావకివి కాక జీవితం ప్రసాదించిన కొన్ని సమస్యలున్నాయి. అందులో మొదటిది సరైన వుద్యోగం కాని వనకాధారం కాని లేకపోవటం—చెల్లాయి పెళ్ళొకటి—నలుగురూ అడుగుతారు. 'అమ్మాయి అచ్చోసిన ఆంబోతులా తిరుగుతుంటే పెళ్లెందుకు చెయ్యరు? పెళ్ళానికి మల్లే ఇదికూడా వోనాడు వుడాయిస్తుంది' అంటారు ఈ మాటలన్నీ పడుతూ—ఈ సమస్యలను ఛేదించటానికి మార్గం వెతుక్కుంటూవుంటే జీవితకాలం సరిపోతుంది. మోకాలు వరకూ గెడ్డం పెరుగుతుంది. జుట్టు తెల్లబడుతుంది. ఆగతే బావకు పట్టేట్టుగా వుంది. ఆవేళ బావను చూట్టంతో అతని మనసంతా చికాకుతో నిండి పోయింది. రాగానే అక్కయ్యతో అంతా చెప్పాడు. అతను వెళ్ళేసరికి సీతాపతితో మాట్లాడుతూ నేవుంది. శ్రీపతి వుత్సాహంగా వుండలేక పోయాడు.

పిచ్చి పిచ్చి ఆలోచనల్తో ఆ రాత్రంతా అతనికి నిద్ర పట్టలేదు. జీవితాన్నంతా విమర్శించుకున్నాడు మళ్ళీ. మర్నాడు వుదయం లేచేసరికి కళ్లు మండి పోయాయి. తల బరువుగా వుంది. నాడి పట్టుకుని చూసుకుంటే జ్వరం వచ్చిందని తేలింది. నిద్ర లేక పోవటం మూలాన వచ్చింది. అదే తగ్గుతుందనుకున్నాడు కాని మధ్యాహ్నానికి పడుకో బెట్టేసింది. అక్కయ్య సీతాపతికి ఫోన్ చేసింది.

'ఎందుకక్కయ్యా! అదే తగ్గిపోతుంది. ఈ మాత్రం దానికి డాక్టరెందుకు?' అన్నాడు. వున్న విషయం, అతనికి సీతాపతి రావటం ఎంతమాత్రం యిష్టంలేదు. మరో పావుగంటకు అతను కారుమీద వచ్చి పరీక్ష చేశాడు. ఇంజెక్షన్ ఇచ్చేసి వెళ్ళాడు. తగ్గిపోతుందనుకున్న జ్వరం క్రమంగా టైఫాయిడ్‌లోకి దింపింది. సీతాపతి రోజుకు మూడుసార్లు వచ్చి చూసి పోతున్నాడు...ఇదికాక మరోసారి తీరిగ్గా వచ్చి

ఆమెతో కబుర్లు చెబుతూ కూర్చునేవాడు. డాక్టరు పోయిన తరువాత సీతాపతికి ప్రాక్టీస్ మంచి జోరుగా వుంది.

అక్కయ్య రాత్రింబగళ్లు మంచంపక్కన కూర్చుని తనకు సేవచేసింది. ఒక్కొక్కనాడు తిండికూడా మానేసేది...అతను క్రమంగా కోలుకున్నాడు... కాని శ్రీపతి ఆలోచనలు మరో దిశలో విచిత్రంగా సాగిపోయాయి. ఒకవేళ అక్కయ్యకాని సీతాపతిని పెళ్ళిచేసుకుంటుందేమో! వాళ్ల మాటలతీరు—నవ్వులాటలు చూస్తుంటే అలాగేవుంది. అక్కయ్య లేచి రావటం సరైందని తనను తానెలా ఊరడించుకున్నాడో—అలాగే—ఈ సంఘటన జరిగినా సమర్థించుకుని తనను తాను ఊరడించుకోవాలి. అయినా సీతాపతి వితంతువును చేసుకుంటాడా? అతనికి వెంటనే నవ్వొచ్చింది. అక్కడ బావ బతికే వున్నాడు. ఇక్కడ సంఘంలో అక్కయ్య విధవగా చలామణీ అవుతోంది......

*   *   *

ఈమధ్య ఏడింటికే శ్రీపతి మంచ మెక్కుతున్నాడు. ఆరయ్యేదాకా అతనికి మెలకువరాదు. ఓనాడు అర్ధరాత్రి అతనికి మెలకువ వచ్చింది. ఎక్కడో గుసగుసలు వినిపిస్తున్నాయి. అతను లైటు వేసి పక్కగదిలో కెళ్ళాడు. అక్కడ సీతాపతి, అక్కయ్య కనిపించారు.

"అరె!...డాక్టరుగారెప్పుడొచ్చారు?" అన్నాడు. సీతాపతి కంగారుపడుతూ 'గంటవుతుంది' అన్నాడు.

"ఇలా మామూలుగా వొస్తూంటారా సరదాగా?" అని నవ్వుతూ అడిగాడు. ఎలాంటి సమాధానమూ రాలేదు. శ్రీపతి లైటు ఆర్పేసివచ్చి పడుకున్నాడు.. ఏమైనా సరే! ఈ వాతావరణంలోంచి తను బయటపడాలి.....

ఇది ఆఖరుకు వ్యభిచార గృహంగా తయారయ్యేలా వుంది.

సీతాపతి వెంటనే వెళ్లిపోయాడు.

మర్నాడుదయం శ్రీపతి అపరాధ దనుకుంటూ భయపడుతూ అడిగాడు: "అక్కయ్యా!... నువ్వు పునర్వివాహం చేసుకుంటావా?" అని. ఆ ప్రశ్న అడిగాడేకాని అతను అక్కయ్య మొహంలోకి ఏమాత్రం చూడలేక పోయాడు.

"ఏం! అలాగ అడుగుతున్నావు? నాకలాంటి ఆలోచనెప్పుడూ లేదు'' అని సమాధానం ఇచ్చింది.

అతను సాయంత్రం యింటికి తిరిగొచ్చేసరికి అక్కయ్య అటుతిరిగి పడుకునుంది. వేళకాని వేళ యెందుకు పడుకునుంది? వంట్లో బాగాలేదేమో ననుకున్నాడు. అక్కయ్యను లేపబోయి కెవ్వుమన్నాడు. ...అతనికి ఏడుపురాలేదు. పెద్దగా ఏడుద్దామనుకున్నాడు కాని ఎవరో పీకనొక్కేసి నట్టయింది. అది శాశ్వతనిద్ర. బల్లమీద వుత్తరం చదువుకున్నాడు.

"తమ్ముడూ!

ఆత్మహత్య పాపమని చేతకానివాళ్లంటారు. అంతకంటే జీవిత శృంఖలాల్లోంచి బయట పడడానికి మంచిమార్గం లేదు. అందుకే నన్ను నేను అంతమొందించుకుంటున్నా.

మరి ఈ ఆత్మహత్యకు కారణం ఏమిటని అడగవూ? డాక్టరుగారంటే నాకెంతో గౌరవం. ప్రేమ—కానీకి కొరగాని నన్ను వివాహం చేసుకుని ఆయన ఉద్ధరించాడు. అటువంటి ఆయనకు ద్రోహం చేశాను. నా భర్తను వదిలిరావటం నేను ద్రోహం అనను... నా ఆత్మహత్యలో సీతాపతిగారికి వాటా తప్పక వుంది. అందుకు ప్రాయశ్చిత్తం యిది. ఆ బాధ ననుభవిస్తూ కుమిలిపోయే దానికంటె యిది ఉత్తమం. ఇంక నేను బ్రతికి ఏంలాభం చెప్పు?

నువ్వు వట్టి అమాయకుడివి. తెల్లవన్నీ పాలు—నల్లవన్నీ నీళ్లు అని విశ్వసిస్తావు. గడుసుగా వుండటం నేర్చుకో. ఎన్ని మానసిక బాధలున్నా అన్నింటినీ అణిచేసుకుని నాలా పైకి నవ్వుతూకనపడాలి. అప్పుడే ఈ సంఘంలో బ్రతగ్గలవు. అంతేకాని అడుగడుగునా భయపడుతూ జీవయాత్ర సాగించలేవు. కొంత తెగింపు. ఎదిరించే శక్తి వుండాలి. అందుచేత అనవసరంగా గడచిన వాటిని తల్చుకుని ఏడవక బుద్ధిగా చదువుకుని ఉన్నతస్థితికి రా. నీ ఔన్నత్యానికి ఆయనకూడా కారకులు గనుక నన్ను మర్చిపోయినా ఆయన్ను జ్ఞాపకముంచుకో...నాకిలాంటిగతి పట్టిందికదా అని నాలా తెగించిన వాళ్లందరికి జీవిత పర్యవసానం ఇదేనని నేను విశ్వసించను. చిన్నవాడవయినా నా పొరపాట్లు క్షమించు...ఆశీస్సులు...''

శ్రీపతి వుత్తరం భద్రంగా దాచాడు. మళ్ళీ యెప్పుడయినా అక్కయ్య ఆదేశాన్ని చదువుకోవచ్చు కర్మకాండంతా పూర్తయ్యేసరికి రాత్రి తొమ్మిదైంది. ...శ్రీపతిని వోదార్చటానికెవరూ లేరు. ఆదుకోటానికి బంధువులెవరూ లేరు. బావకు టెలిగ్రాం యిద్దామనుకున్నాడు. అనవసరంగా అతన్నెందుకు శ్రమ పెట్టడం! ఆ రాత్రి అతనింటిదగ్గరుండలేక పోయాడు. ఎక్కడ చూసినా అక్కయ్యే కనిపిస్తోంది. కొంచెం భయం వేసింది కూడా. అక్కయ్యకు మల్లే తనూ "స్లీపింగ్ టాబ్లెట్స్" ఓ డజను వేసుకుంటే... శ్రీపతి తలుపు తాళం వేసి బయలుదేరాడు. తిన్నగా వెళ్లి పార్కులో కూర్చున్నాడు.

వాతావరణం ప్రశాంతంగా వుంది. గాలికూడా స్తంభించి పోయింది. ఆకాశంలో నక్షత్రాలు చీకటిని చూసి భయంతో వొణుకుతున్నాయి. శ్రీపతి చెక్కిళ్లమీదుగా నయాగరా జలపాతంలా నీరు ప్రవహిస్తోంది. అతనికి గడచిన జీవితం అంతా జ్ఞప్తికొచ్చింది.

నాన్న!....ఎవర్నీ మెప్పించలేని జన్మ! చచ్చినవాడి కళ్ళు చేరడని చనిపోయాక అందరూ పొగిడారు. పిచ్చివాడిలా తిరిగాడు. తన ఛాదస్తంతో కొడుకును దూరం చేసుకున్నాడు. అయినా నాన్న తన కోసం ఎంత శ్రమించాడు! తను కృతఘ్నుడు కదూ! జంతువులకైనా కుక్కకైనా కృతజ్ఞత వుంటుంది. మానవుడే కుండదు. గర్భశోకం గురించి తన కేమీ తెలియదు. తెలియక పోవటమే మంచిది. ఇంక బావ!...పిచ్చి బావ! అమ్మ నాన్న పన్నినవల్లో చిక్కుకుని రాలేక బాధపడ్డాడు. ఇంకా అతనెన్ని బాధలు అనుభవించాల్సి వుందో!...లేక అతనుకూడా అక్కయ్యకు మల్లే హఠాత్తుగా శూన్యంలో కలిసిపోతాడేమో!... ఇంక అక్కయ్య! అమ్మో! అదో గంభీరస్వరూపం... దాన్ని తల్చుకోలేం...ఇంక తను? సిరుండ్స్ అన్నాడు..."నీ గురించి నీకు పూర్తిగా తెలియదు."

అదీ నిజమే ననిపించింది. ఇంటర్‌లో చేరేవరకూ తన అభిప్రాయాలు?...దేవుడంటే అమితభక్తి!

ఈ రెండేళ్లలో తను పూర్తిగా మారాడు. వచ్చిన కొత్తలో అనాది మానవుడికీ - తనకూ మధ్య అంగుళం మాత్రమే దూరం—తన భావాలు, ఆశయాలు అన్నీ విపరీతంగా మారిపోయాయి. స్కూలు ఫైనలు దాకా గడచిన అతని జీవితక్రమం స్ఫురణకు వచ్చింది..ఆరుదాటకుండా లేవాలి. ఆరున్నరకల్లా గణగణమని గంటమోగిస్తూ నాన్న పూజకు నాందీ వాక్యం పలికేవాడు. విధిగా తను పూజ అయ్యేవరకూ ఆ ఇత్తడి విగ్రహాలకు నమస్కరిస్తూ కూర్చోవాలి. భక్తిలేకపోయినా అథవా వున్నట్టయినా నటించాలి... అదవగానే చల్దన్నం తిని పుస్తకం చదువుకోవాలి. మధ్యమధ్య నాన్న వచ్చి తనిఖీ చేస్తుంటాడు. బయటికి పోకూడదు. సినిమాలు చూడకూడదు. అథవా చూసినా పోతన-త్యాగయ్య-లాంటి భక్తిరసచిత్రాలకే ప్రవేశం. పత్రికలూ-నవలలూ చదవకూడదు. టంచనుగా అయిదయ్యేసరికి పుస్తకం పుచ్చుకొని చదువుకోవాలి. షికార్లకు పోకూడదు. ఇదీ అతని జీవితం. ఇంటి దగ్గర్నుంచి స్కూలుకున్న రెండు ఫర్లాంగుల రోడ్డు తప్పించి అతనికేవీ తెలీదు. తెలుసుకోవలసిన అవసరం కూడా లేదు.

కాని ఇప్పుడు! అంతా మారిపోయింది.

పన్నెండుగంటలవరకూ అతనక్కడే వున్నాడు. నైట్ వాచర్ అతన్ని బైటికి పంపాడు.

అంతులేని ఆలోచనల్తో చీకట్లో ఒంటరిగా నడుస్తూ వస్తూన్న శ్రీపతిని ఏటి వొడ్డున గంభీరంగా నిలబడిన క్లాక్ టవర్ 'నీ భావిజీవితం గురించి ఆలోచిస్తున్నావా?' అనడిగి నట్టయింది.

అతను వెర్రిగా నవ్వుకుంటూ కటిక చీకట్లో కలిసిపోయాడు.